
# ఇదీ ఈనాటి కథ



సుమతి ఉలిక్కిపడి నిద్రలేచింది! అంతవరకు చెవులుచిల్లులుపడేటట్లు ఓండ్రపెట్టిన మునిసిపాల్టీ వాళ్ళ ముద్దులపట్టి 'అబ్బా! అలిసిపోతి'నంటుంటే రాగచ్ఛాయలుమాత్రం మంద్రస్థాయిని చేరుకొంటున్నాయి.

ఉలిక్కిపడి నిద్రలేచిన సుమతి మెల్లగా పైకిలేచింది. కిటికీవద్దకు నడిచింది. కిటికీ తెరిచి వీధివైపు చూసింది. చలిగాలి. ఎవరో వెంటపడి తరుముకొస్తున్నట్లు ఎటూ దారిగానక ఆ కిటికీ సందులోనుండి దూరి అడ్డుపడిన ఆమె చెంపల్ని తాకి అలజడిచేస్తే–ఆమె రెండు చెంపల్ని రెండు అరచేతుల్తో కప్పుకొని 'విపరీతాల్లో మరీ విపరీతంగా ఉందే! శివరాత్రికే 'శివ శివా!' అని తోకముడుచుకోవలసిన చలి ఇంకా ఉలికులికిపడుతున్నదే!' అని అనుకొంటూ 'తన చెంపల్ని తాకేహక్కు దానికెవరిచ్చారో? అడుగుదామన్నట్లుగా భర్తవైపు చూసింది.

అతడి కుడికాలు. అలవాటుపడిన కాలు. పైకిలేస్తూ కిందపడ్తూ ఆధారం దొరక్క అవస్థపడ్తూ ఉంది. ఒకచేయి గాలిలో తేలిఆడుతూ ఉంది.

ఆమె చిలిపిగా నవ్వుకొంటూ ఒక్కసారి బద్ధకంగా ఒళ్ళువిరుచుకొని ముందుకు నడిచింది. చీపురుకట్ట చేతికందుకొనింది. వీధివాకిట్లోకి అడుగుపెట్టింది.

ఆ వీధి ఇంకా నిద్రలేవలేదు.

ఒకకప్పుడైతే ఉగాది పండగ వస్తుందంటే– కోడికూతతో పోటీలుపడి నిద్రలేచేవాళ్ళు. పోటీలుపడుతూ ఎవరింటి ముందువాళ్ళు కళ్ళాపులుచల్లి రంగురంగు రంగవల్లికలు తీర్చిదిద్దుతుంటే– ఆ వీధి ఈ చివరినుండి ఆ చివరిదాకా చూడముచ్చటగా ఉండేది.

ఇప్పుడు గంపలకింద కోళ్ళులేవు. ఈ కాలం ఆడపడుచులకు కోడికూత చెవినిపడే ఆస్కారమూ లేదు. అందుకే మున్సిపాల్టీవాళ్ళు– ఆ వీధిలో ముఖ్యమంత్రికి మూడ్ వస్తే తీసుకొంటున్న నిర్ణయాల్లాగా చెప్పకుండా చెందకుండా పొంగిపొర్లుతున్న మురుగుకాలువల్నీ, ఆ వార్డు కౌన్సిలర్ కడుపులాగా ఉబ్బి తొణికిసలాడుతున్న కుప్పతొట్లనీ పట్టించుకోకుండా సైరన్‌కు మాత్రం ప్రాణభిక్షపెట్టి పుణ్యంకట్టుకొన్నారు. తెల్లవారుఝామున అయిదుగంటలకే తట్టి వదులుతున్నారు.

అయినా ఆవీధి ఇంకా నిద్రలేవనే లేదు.

తన ఓటమిని అంగీకరించిన సైరన్ తోకముడిచింది.

సుమతి పల్లెకు ఆడపడుచు. పట్నానికి కోడలు. ఆమె ఒక బడిపంతులు గారి అపరిమిత కుటుంబంలో తొలిచూలు. ఆ పంతులుగారు తన కూతురికి ఏమియిచ్చి ఏమియివ్వకపోయినా అంతోయింతో చదువును మాత్రం ఇవ్వగలిగాడు. ఆ చదువు ఆమె బతుకుతెరువుకు ఒదగకపోయినా అభిమానాన్ని మాత్రం గుండెలనిండుకు నూరిపోసింది.

ఆరోజు అయిదుగంటలకే నిద్రలేచిన సుమతి చీరకొంగు పైకెగచెక్కింది. పైటకొంగు ఈడ్చి నడుమున చెక్కింది. వీధి వాకిల్ని శుభ్రంచేసింది. సిమెంటురోడ్డు కావడంమూలాన పల్చగా పేడనీళ్ళకళ్ళాపు చిలకరించింది. ముగ్గుపిండిచిప్ప చేతబట్టి వాకిట్లో వంగింది.

కుంచె చేతపట్టిన చిత్రకారుడిలా... ఉలీ సుత్తె చేతపట్టిన శిల్పిలా... బహుమతికోసం కథరాస్తున్న కథకుడిలా– సుమతి ఏకాగ్రత ఏలుబడిలో బాహ్యస్మృతినే కోల్పోయి ముగ్గులేస్తూఉంది.

ఆ సమయంలో–

ఆ వీధిగుండా శరవేగంతో వస్తూఉందొక మోటార్ సైకిల్. ఆ మోటార్ సైకిలుపై ఇద్దరు వ్యక్తులు. బండినడుపుతున్న వాడు ముద్దుగా బొద్దుగా ఉన్నాడు. అతని వెనక కూర్చున్న వ్యక్తి చాకులా ఉన్నాడు. రంగులో బండినడుపుతున్నవాడికంటే ఒక వన్నె తక్కువ. అయితే తొడుక్కున్న దుస్తుల్ని చూస్తుంటే అసలుకంటే ఆర్భాటమే ఎక్కువనిపిస్తుంది.

అంతవేగంతో వస్తున్న మోటార్ సైకిల్ తటాలున ఆగింది.

ముగ్గేసుకుంటున్న సుమతి పక్కన్నే ఆగింది.

ఆగడమే తరువాయి. చాకులాంటిమనిషి ఎగిరికిందికి దూకాడు. సుమతి మెడలో వేలాడుతున్న బంగారు గొలుసును 'ఠపీ'మని తెంపుకొన్నాడు. మళ్ళీ ఎగిరి మోటార్ సైకిల్‌మీద కూర్చున్నాడు.

పరవశంలోపడి ముగ్గేసుకొంటున్న సుమతి తేరుకొని 'దొంగ! దొంగ! అని అరిచేసరికి 'ఎక్కడదొంగ? ఎవరుదొంగ? అని అరుస్తూ వీధివీధిగా ఒక్కటయింది.

అయితే ఎక్కడున్నాడు దొంగ?

ఆ మహాపట్నంలో... అందులో మోటార్ సైకిల్‌మీద... ఏసందు గొందుల్లోనో దూరి మాయమవడం ఎంతసేపు?

సుమతి కళ్ళల్లో నీళ్ళు 'అఁ! అంటే 'ఊఁ!' అనడానికి సిద్ధంగా ఉన్నాయి!

"అబ్బరంగా బిడ్డపుడ్తే గడ్డపారెత్తుకోండి చెవులుకుడదాం! అన్నట్టుగా ఉండాదేయవ్వారం. ఈపెకొక్కదానికేనా పండగ? ఈ ఈదిలో ఉండేవాళ్ళెవురూ ఆపెకంటికి మణుసులేకాదు. లేకుంటే తెల్లార్దా? ఏదో పుట్టి మునిగిపోతున్నట్టు ఇయ్యారవకాడ లేసేదెందుకు? ఇద్దో యిట్లానగానట్రా దారపోసుకోని ఏడ్సేదెందుకు?"

అనుభవజ్ఞులు అననే అన్నారు గదా లోకులు కాకులని!

పిలవకనే ఇంటిముందరచేరి అడగకనే తమ అమూల్యాభిప్రాయాల్ని తలకొక్క తీరుగా వినిపిస్తూంటే సుమతికి తలతిరిగి పోతూఉంది. తమాయించుకొని నిలబడలేక ఆమె ఇంట్లోకి పారిపోయింది. సుమతి భర్త సూర్యారావు చూపుల్తోనే అందరికీ కృతజ్ఞతలు తెలుపుకొనేసరికి వీధి చీలిపోయింది.

* * * * *

"ఏమండీ"?

"ఏం సుమీ?"

"నా మనస్సేఁవీ బాగాలేదండీ!"

"నిజఁవే! నా మనస్సు కూడా ఏఁవీబాగాలేదు. అయినా ఏంచేద్దాం చెప్పు? పోయిన దాన్ని పట్టుకొని పాకులాడ్తే వచ్చేదేముంది?"

".... అని మనస్సు సమాధానపళ్ళేదు గదండీ?"

"సమాధానపళ్ళేదని ఇలాసతమతమైపోతే ఎలా? వెధవది. దాన్ని మనం సంపాదించామా? లేదు. అది మనల్ని సంపాదించిందా?"

"నిజఁవేననుకోండి. అయినా మానాన్న ఆ మూడు తులాల గొలుసు చేయించడానికి ముప్పుతిప్పలుతిన్నాడుగదండీ? తల్చుకుంటే గుండె చెరువవుతుంది. ప్రావిడెంట్ ఫండ్‌లోను, ప్రాణానికి ప్రాణంగా చూసుకొంటున్న ఆయన పాత సైకిలు- చాలని కొదవకు అమ్మ ఏడుకొండలవాడికని హుండీపెడ్తే ఆ హుండీలో డబ్బు...ఆయన పడినపాట్లు తలుచుకొంటే!..."

సుమతి వెక్కివెక్కి ఏడుస్తూ ఉంది.

సూర్యారావ్ అనునయంగా ఆమెను అక్కున చేర్చుకొన్నాడు. ఎడమచేతి నడిమి వేలితో కన్నీటిని తుడుస్తూ కుడిచేత్తో చుబుకాన్ని పుణికిపుచ్చు కొన్నాడు. 'మరీ నువ్వింత పిచ్చిపిల్లవయితే ఎలా సుమీ!' అని లాలిస్తున్నాడు.

"ఏంవండీ? పోలీసురిపోర్టిస్తే..." కలగని మేల్కొన్నట్లు ఉన్నట్లుండి అడిగింది సుమతి.

పకపక నవ్వాడు సూర్యారావ్.

"ఎందుకండీ అలా నవ్వుతున్నారే?"

"ఈరోజుల్లో పోలీసు రిపోర్టంటే దారిజగడం ఇంటిదాకా అన్నట్లవుతుందని!"

"అయితే నేనింక ఈ వీధిలో వాళ్ళమొగం చూడలేనండీ!"

"అయితే ఈవూరొదిలి పారిపోదామా?"

"మీకంతా నవ్వులాటేనండీ!... అది కాదు. ఎవరో దొంగవెధవలు... మన సొత్తును దోచుకొనిపోతే– అందరూ నన్ను దొంగను చూసినట్లు చూస్తున్నారండీ!"

"అయితే ఒక్క పనిచేద్దాం!"

"చెప్పండి"

"ఒక్క నాలుగుదినాలు మీ అమ్మగారింట్లో ఉండొస్తే సరిపోతుందికదా?"

సుమతి భర్తమొగాన్ని తదేకంగా చూస్తూ ఉంది. ఆ చూపుల్లో మాటలకందని కృతజ్ఞతా భావం తొణికిసలాడ్తూ ఉంది.

"అవును సుమీ! ఎలా పండగ వస్తావుందిగదా! లేదంటే నాలుగురోజులు ముందుగా వెళ్ళినట్లవుతుంది. నేనూ పండక్కి సెలవుబెట్టి వచ్చేస్తాను. అక్కడుంటే నీ మనస్సుకాస్త ఊరటపడుతుంది. ఆ లోపల ఈవీధి ఆమాటనే మరిచిపోతుంది"

బాధను తన బాధగా అన్వయించుకొని అనునయించే భర్త భగవంతుడికంటే గొప్పవాడని సుమతి ఎక్కడో చదివింది. ఆ సమయంలో ఆమెకు భర్త భగవంతుడికంటే మిన్నగా కనుపిస్తున్నాడు. ఆ భావనలో తృప్తి. తృప్తిలో ఊరట. 'బంగారంపోతే పొయ్యింది. బంగారంలాంటి భర్త ఉన్నాడు కదా?' అనుకొనేసరికి ఆమె పిడికెడంత గుండె పిట్టలా రెక్కలు విప్పుకొనింది.

ఆమె తెంపుగా పైకిలేచింది!

*    *    *    *    *

సేట్ చందూలాల్ ఆ ఊళ్ళో పేరుమోసిన బంగారు వ్యాపారి.

చందూలాల్ కొత్తనగలు అమ్ముతాడు. పాతనగలు కొంటాడు. అమ్మేదీ బంగారమే! కొనేదీ బంగారమే! అతడి బతుకే బంగారం. బంగారంలాంటి బతుకులో కొన్నావ్యాపారమే! అమ్మినా వ్యాపారమే!

చందూలాల్ తలమీద నల్లటోపీ?- గుండు చెంబులా గుండ్రంగా... నిమ్మపండులా- నిగనిగలాడుతున్న తలమీద నల్లటోపీ! ఆటోపీ తెల్లటి ఖద్దరు టోపీలకంటే తెలివయింది. ఎర్రటోపీల్నే ఏమార్చగలిగింది.

అందుకే సేట్ చందులాల్ కిందనిలబడి తలెత్తి తనమేడ చివరిఅంతస్థును చూసిన పాపానపోలేదెప్పుడూ!- అతను చూడలేదని అది పెరగడం మానలేదెప్పుడూ!!-

ఆరోజు బారెడు పొద్దెక్కింది.

కావిరంగు నీరెండపండి లోకమంతా కళ్ళాపిచల్లుతూ ఉంది.

సేట్ చందూలాల్ మహడీముందర రంగు రంగు రంగవల్లికలు తమాషాలు పడ్తున్నాయి.

తెల్లటి పరుపులపై నిమ్మపండురంగులో సేట్ చందూలాల్ కూర్చుని ఉంటే- తెల్లని మల్లెపూవుమీద తేనెటీగ కూర్చున్నట్లుంది.

ఆవేళప్పుడు సేట్ చందూలాల్ మహడీముందు ఒక మోటార్ సైకిల్ ఆగింది. చాకులాంటి ఇద్దరు కుర్రవాళ్ళు చరచరలోనికి వచ్చారు. జేబులో చేతిలోగొలుసును సేట్ చందూలాల్‌కిచ్చారు- హడావిడిగా!

సేట్‌జీ ఆ గొలుసును అటుతిప్పి ఇటుతిప్పి వాళ్ళ హడావిడి ఒరిపిడిరాయిలో వన్నెకట్టడానికి ఎదుట నిలబడుకొన్న వాళ్ళను ఎగాదిగా చూశాడు.

సేట్ చందూలాల్‌కి కొనేవాడి కోరిక తెలుసు. అమ్మేవాడి ఆరాటమూ తెలుసు. ఆతురతాతెలుసు. కొనేవాడికోరికను అమ్మేవాడి ఆతురతనుబట్టి మాట్లాడేతీరు అంతకంటే బాగా తెలుసు! అందుకే-

"అరె రాం రాం! ఆజ్‌కీ బేపార్ క్యాహై ఐసా ఘర్ హోగయా?... ఎవుర్కీ మొఖ్ఖందేఖాభై! అరె రాం రాం!" అని రాముణ్ణి స్మరిస్తూ ఉసూరుమన్నాడు.

మోటార్ సైకిల్ హీరోలు ఒకరిమొగం ఇంకొకరు చూసుకొంటున్నారు.

"అరె రాం రాం! మీదీ మీదీ మొఖం హెంద్కూ చూస్కుంటార్ భై!- ఇస్కూ మొఖ్ఖందేఖో!... ఏరోల్డ్‌గోల్డ్‌హై! అరెరెరె! పహలె పహలె క్యాబేపార్‌మిలె!" అంటూ ఆ గొలుసును విసిరేశాడు, అది తెల్లటి పరుపులమీదపడి మిలమిలా మెరుస్తూ ఉంది.

మోటార్ సైకిల్ హీరోలకు మొగానకత్తివేటుకు నెత్తురుచుక్కలేదు. అయినా తమాయించు కొని చందూలాల్‌వైపు పరిశీలనగా చూశారు. నిద్రలేస్తూనే రోల్డుగోల్డుతాకిన పాపానికి ప్రాయశ్చిత్తంగానేమో- చందులాల్ నిమీలిత నేత్రుడై దేవుడివైపు తిరిగి చేతులు జోడిస్తున్నాడు.

హీరోలు గొలుసునుచేతికందుకొన్నారు. ఒకసారి అటుయిటు తిప్పిచూస్తూ సేట్‌జీని ఒక చూపుచూశారు. అతనిలో ఏమార్పు కనిపించడంలేదు. అంతే! ఎంత విసురుగా లోపలికి వచ్చారో అంత విసురుగా బయటికి నడిచారు- ఆగొలుసును విసిరికొట్టేసి!

ఆ మరునిమిషంలోనే మోటార్‌సైకిల్ గడబిడ రొదచేసుకొంటూ వెళ్ళిపోయింది.

ఇప్పుడు నిజంగానే సేట్ చందూలాల్ రెండుచేతులెత్తి దేవుడికి నమస్కరించాడు.

*          *          *          *          *

ఊరిశివార్లలో ఆర్టీసీ బస్‌స్టాండ్ ఉత్సవం చేసుకొంటూఉంది.

సుమతి సుబ్బారావు ఒకరిపక్కనొకరు వద్దికగా నిలబడి నెల్లూరు బస్ కోసం నిరీక్షిస్తున్నారు.

పుట్టింటి ఊహలతో సుమతి మొగం మిలమిలా మెరుస్తూ ఉంది.

పదిగంటలకే రావలసినబస్సు పదకొండుగంటలైనా రాకపోయేసరికి పదిగంటలకే ఆఫీసుకుపోవలసిన సూర్యారావు విసుక్కొంటున్నాడు. సుమతి గమనించేస్థితిలో లేదు.

నిలబడి నిలబడి సూర్యారావు కాళ్ళుపీకుతున్నాయి. వస్తూపోతున్న వాళ్ళు తమ వైపు చూస్తున్న ఆకలిచూపులు వెగటు పుట్టిస్తున్నాయి. అనుకొన్నవేళకు కాకుండా ఆలస్యంగావస్తే అంతస్థు పెరుగుతుందని ఆలోచించే రాజకీయనాకులకు ఆర్టీసీ బస్సులకు పొంతనాలు కుదర్చడానికి సూర్యారావు ప్రయత్నిస్తున్నాడు.

దీనికంతటికీ అతీతంగా సుమతి పుట్టింటి తలపోతలతో తలమునకలవుతూ ఉంది.

అంతలో ఎక్కడనుండి వచ్చిందో ఏమో? ఒక మోటార్ సైకిల్ బాణంలా దూసుకొని వచ్చింది. తటాలున వాళ్ళముందర ఆగింది. ఆగీ ఆగడంతోటే మోటార్ సైకిల్ వెనుక కూర్చున్నవాడు ఎగిరి కిందికి దూకాడు. దారాన్ని తెంపుకున్న సెగటగొడ్డులాగా సూర్యారావ్ మీద పడ్డాడు. ఈచెంపా ఆచెంపా 'ఫెళా ఫెళా' వాయించాడు. మళ్ళీ ఎగిరి మోటార్ సైకిల్‌మీద కూర్చుంటూ, "రాస్కెల్! పెళ్ళాంమెళ్ళో గిల్టునగ వేస్తావంట్రా గెతిలేన్నాకొడకా! మొకంచూడు. ఏదో ఉన్నవాడిలా పెద్దపోజు. సిగ్గులేకపోతే సరి!" అంటూ రివ్వున ముందుకు దూసుకొని పోయాడు.

ఎదురుచూడని సంఘటన!

అయినా అనుకొన్నట్లుగా అంతా అరక్షణంలో జరిగిపోయింది.

"ఏంవిటీఅన్యాయం? ఎందుకలా కొడ్తున్నారే? ఆయన్నొదలండి" అని గొంతెత్తి అరవాలను కొని గొంతు పెగలక కొయ్యబారిపోయిన సుమతి ఏమీచెయ్యలేక చేతనైనపని ఒకటే! – ఏడుపు. అదే చేస్తూ ఉంది.

"ఎవరువాళ్ళు? ఎందుకలా పైనబడి బాదినారే? అయినా నువ్వేంమొగోడయ్యా? కొడ్తా ఉంటే నిలువురాయి మాదిర నిలబడి దెబ్బలు తినడమేనా పని? ఛఛ! ఏంకాలమో? పాడుకాలం. ఒక న్యాయంవూ లేదు. అన్యాయంవూ లేదు" అంటూ చుట్టుపక్కలవాళ్ళు గుంపుచేరి వాపోయినట్లే వత్తెక్కిస్తున్నారు.

సూర్యారావుకు తలకొట్టేసినట్లయింది. ఒక్కక్షణం అక్కడ నిలబడలేక గబగబ ముందుకు నడుస్తున్నాడు. వంచినతలెత్తకుండా నడుస్తున్నాడు. సుమతి 'ఏంవండీ! ఏంవండీ!' అని ఎలుగెత్తి

అరుస్తున్నా తిరిగి చూడకుండా నడుస్తున్నాడు. ఎంతవేగంగా నడిచినా అతనివేగాన్ని సుమతి అందుకోలేకపోతూ ఉంది. పరుగునడకగా వెంటపడింది.

సరిగ్గా రెండుగంటలకుముందు. ఇంటి నుండి బస్‌స్టాండ్‌కి బయల్దేరినపుడు ఒకే రిక్షాలో ఇద్దరు... ఒకరిపక్కనొకరు...మున్సిపాల్టీరోడ్డులో గుంతలమిట్టలపుణ్యమా? అంటూ ఒకరిమీదపడ్తూ ఒక్కరు! రెండు గంటల కాలవ్యవధిలో ఒకరితోసంబంధమే లేనట్లుగా ఇంకొక్కరు!...

సూర్యారావు ఇంట్లో అడుగుపెట్టాడు. చేతిలో సూట్‌కేస్ విసిరి ఒక మూలకు కొట్టాడు. మనిషి పూనకం పూనినట్లు ఊగిపోతున్నాడు. అతని కండ్లల్లో చింతనిప్పులు రాల్తున్నాయ్-మూడుతులాల బంగారు గొలుసుపోయిందే అన్న బాధతోకాదు. పదిమందిలో పట్టుకొని ఎవడో ముక్కూమొగం ఎరగనివెధవ ఈచెంపా ఆ చెంపా వాయించినాడే? అన్న పరితాపంతో కాదు.

గిల్టు నగపెట్టి తన్ను మోసంచేసిన మామగారిమీద కసి!

అదిగిల్టునగ అని తెలిసికూడా మెడలో వేసుకొని మోసగించడమే కాకుండా ఇంత అవమానానికి కారణభూతమైన పెండ్లాంమీద ద్వేషం!!

మనిషి పొగలు సెగలు కక్కుతున్నాడు.

అయిదు నిమిషాలు అటో ఇటోగా సుమతి ఇంట్లో అడుగుపెట్టింది.

అంతే! పొంచికూర్చున్న పిల్లి ఎలుకమీద పడినట్లు సూర్యారావ్ సుమతి మీద పడ్డాడు. కసిదీర చెంపదెబ్బలు...పిడిగుద్దులు...అత్తమీదకోపం దుత్తమీద చూపించి సూర్యారావ్ అలిసిపోతే సుమతి సొమ్మసిల్లి పడిపోయింది.

అప్పటికీ అతనికోపం చల్లారలేదు.

"గతిలేదని ఒక్కమాటంటే సరిపొయ్యేదానికి ఇంతమోసం చెయ్యాలా? గిల్టు నగపెట్టి పదిమందిలో నా పరువు తీస్తారా? ఛీ ఛీ!" రొప్పుతూ రోజుతున్నాడు సూర్యారావ్.

చెంపలు మండిపోతున్నాయి. వీపు బద్దలయినట్లుంది. ఒళ్ళంతాహూనమయి గొంతు పెగలలేకపోతూ ఉంది. అయినా ఎట్లోనిబ్బరించుకొనింది సుమతి!

"మీరు అనవసరంగా ఆవేశపడిపోతున్నారండీ!"

ఏడుపుతో కలగలిసిన మాటను ఎలాగో అనగలగింది.

"ఆవేశంకాదే అవమానం. పదిమందిలో తీరని అవమానం. తలెత్తుకొని తిరగలేని అవమానం. ఇంతమోసం చేసినదానివి ఇంకొక్కడికి కొంగెయ్యడానిక్కూడా వెనుకాడవే?"

"ఏవండీ?"

శక్తినంతా కూడగట్టుకొని గుండెలు పగిలేటట్లు అరిచింది సుమతి.

'ఏం? ఎందుకలా గొంతుచించుకొంటావ్?'

"మీరు కొట్టండి. కొయ్యండి. మీ చేతుల్తోనే చంపిపారెయ్యండి. కానీ అంతంత మాట్లనద్దండీ!– నేను మిమ్మల్ని మోసం చేస్తానా? చెప్పండి. నా మొకం చూసిచెప్పండి"

"ఛీ! ఇంకా నీ మొకం చూడమంటావా? అంతకంటే ఇంత విషంతిని చావొచ్చు. ఇంక ఈ ఇంట్లో ఇద్దరుండడానికి వీల్లేదు. ఉంటే నువ్వు. లేకుంటే నేను. అంతే!"

దురుసుగా అంటూ విసురుగా బయటికి నడిచాడు సూర్యారావ్.

భర్తవెళ్ళినవైపేచూస్తూ సుమతి ఆలోచనల్లో పడింది.

"తండ్రి బతకలేని బడిపంతులేకావచ్చు. అయితే కన్నకూతురికే మోసం తలపెడ్తాడా? లేకుంటే– ఆ దొంగవెధవలు అంత పట్టింపుగా పనిగట్టుకొని వచ్చి పగ తీర్చుకోవాల్సిన అవసరమే మొచ్చింది? అయితే అది గిల్టుగొలుసే అయ్యుండాలి. ఛీఛీ! తండ్రి మోసంచేస్తాడా? లేక అతడే మోసగింపబడ్డాడా? ఏవిషయాన్నీ తెలుసుకోవాలంటే ఏంచెయ్యాలి? అడగాలి? ఏ మొకం పెట్టుకొని వెళ్ళడం? వెళ్ళినా ఏమని అడగడం? అడిగినా నిరూపించేదెలా? ఇది చిత్రాతిచిత్రంగా తయారయిందే? నాకూ నా భర్తకు మధ్య నాకూ నాతండ్రికీమధ్య తలెత్తిన సున్నితమైన సమస్య. ఇటు నూయి. అటు గోయి. ఏం చేయాలి?"

ఆమె ఆలోచనలు అనంతంగా సాగిపోతుంటే "వీల్లేదు. ఈ ఇంట్లో ఇద్దరుండడానికి వీల్లేదు. ఉంటే నువ్వు. లేకుంటే నేను" అన్న భర్తమాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

"నా బతుకు ఇప్పటికే గిల్టు బతుకైపొయ్యింది. ఆయనపోతే అంతకంటే హీనమైపోతుంది ఈ సమాజంలో! నేనేపోతే ఆయన బతుకు మళ్ళీ చిగురించవచ్చు. ఈ గిల్టు బతుకింక ఉండడానికి వీల్లేదు"

పిచ్చి పిచ్చి ఆలోచనలతో సుమతి సతమతమవుతూ ఉంది.

'ఎవరేమైతే నాకేం? నాపని నాది!' అన్నట్లుగా కాలం గడుస్తూ ఉంది.

* * * * *

సేట్ చందూలాల్‌కి బంగారం విలువ కట్టడం తెలుసు. ఆ బంగారానికంటే విలువయింది కాలమనీ తెలుసు. కాలము– అంటే డబ్బు అని అక్షరాభ్యాసం చేసినప్పటినుండి అభ్యాసం చేశాడు.

అందుకే అతడు అర్ధశరీరమని నమ్మే భార్యకంటే, పున్నామ నరకంనుండి రక్షిస్తాడని కలలుగనే ఒక్కగానొక్క కొడుక్కంటే అంగడినే ఎక్కువగా ప్రేమిస్తాడు కాదు– పూజిస్తాడు.

ఈ పూజకు పువ్వులు అవసరంలేదు. కాయకర్పూరం అవసరంలేదు. పండ్లు ఫలహారాలు అసలేఅవసరంలేదు. వేళకుసరిగ్గా అంగడితెరిచి తెరిచినప్పటినుండి కనీసం కాఫీ కోసరంకూడా కాలుబయట పెట్టకుండా ఇనప్పెట్టె ముందు కూర్చుంటే– లక్ష్మీ ప్రసన్నమవుతుందని సేట్‌జీ విశ్వాసం.

ఈ విశ్వాసం ఇంతవరకు వమ్ముకాలేదు.

ఆరోజు గంట ఎనిమిదై ఉంటుంది.

సేట్ చందూలాల్ ఇనప్పెట్టెలో నగల్ని సూట్‌కేస్‌కు నింపుకొని మార్వాడీ బ్యాంకికి బయల్దేరాడు– అంగట్లో కొడుకునుకూర్చోబెట్టి. తన ఏడంతస్థుల మేడముందు దర్జాగా నిలబడి 'అరె రిక్షాభయ్యా! రిక్షాభయ్యా!' అని అరిచాడు మున్సిపాల్టీ సైరన్‌లా.

దారినపోతున్న రిక్షా మహడీ ముందు ఆగింది. ఆగడమే తరువాయిగా సేట్‌జీ తన భారీకాయాన్ని రిక్షామీదికి చేరవేశాడు. రిక్షా బయల్దేరింది.

మహావృక్షంలా ఎదిగి మార్వాడీలకంతా నిలువనీడనిస్తున్న మార్వాడీ బ్యాంకులో నగలు కుదువబెట్టి ఎంత డబ్బు తేవాలో? తెచ్చిన డబ్బును ఎవరెవరికి ఎంతెంత వడ్డీ రేటుకివ్వాలో? ఈ లావాదేవీల్లో తన లాభమెంతో? అని సేట్‌జీ లెక్కలు వేసుకొంటుంటే రిక్షా బ్యాంకు ముందర ఆగింది.

సేట్ చందూలాల్ రిక్షాదిగి సూట్‌కేస్ చేతికందుకొని ఆ మీదట జేబులో చెయ్యేసి తారాడితారాడి ఒక అర్ధరూపాయి బిళ్ళ చేతికందుకొని రిక్షావాడి చేతిలో పెట్టాడు. పెట్టకముందే కండ్లకద్దుకొన్నాడు కూడా!– అయినా రిక్షావాడు ఈడెగిరి ఆడపడ్డాడు.

"యోసేటా! నా బాడిగక్కడపెట్టేసి ముందుక్కదులు. మూడుకిలోమీటర్ల దూరం ముగ్గురి బరువును తొక్కోనొస్తే ముష్టి అర్ధరూపాయా?"

"ఎంకూసినావురా బేవ్‌కూఫ్‌కా బేటా!– ముగ్గుర్నీ తొక్కోనొచ్చినావ్!– హైతే హింకా హిద్రూఏమైనార్రా? నువ్వా మింగేసినావ్? నీది రిక్షా మింగేసిందిరా? ఏక్ రోజ్‌కి మూడుసార్లువచ్చి ఆరుసార్లు వస్తాపోతాం మేం! మాకీ నేర్పుతావ్? జావ్‌రే జావ్!" అంటూ సేట్‌జీ అడుగుముందుకు వేశాడు.

"సేటా! నాబాడిగక్కడ పెట్టికదులు!" అంటూ రిక్షావాడు సేట్‌జీచేతిలోని సూట్‌కేస్ పెరుక్కొన్నాడు. అంతే! సేట్‌జీ "దొంగ! దొంగ!" అని గావుకేకలు పెట్టాడు.

స్వజాతిగొంతు చెవినిపడేసరికి చుట్టుపక్కల మార్వాడీలు కాకుల్లా రిక్షా చుట్టుముట్టి గోలచేస్తున్నారు. కొందరు ఆవేశంతో చేతులు పైకెత్తారు. రిక్షావాడు కూడా రెండుచేతులు పైకెత్తాడు– కొట్టడానికాదు– మొక్కడానికి!

దాంతో శాంతించిన మార్వాడీమూక ఇద్దరికీ రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తూంటే అదొక రభసలా తయారయింది. ఆ రభస ఆ సమయంలో ఆదారిన మోటార్‌సైకిల్‌మీద పోతున్న సబ్– ఇన్‌స్పెక్టర్ మోహనరావ్ దృష్టిని ఆకర్షించింది.

అతడా గుంపుదగ్గర ఆగాడు.

మోహన్‌రావును చూసేసరికి రిక్షావాడికి కొండంతబలం చేకూరింది.

"ఏంవిటీ గుంపు? ఏం జరిగిందిక్కడ?" అని అడుగుతూ గుంపులో జొరబడ్డాడు మోహన్‌రావు.

అందరికంటే ముందు రిక్షావాడు ముందుకొచ్చి రెండుచేతులు జోడించాడు.

మోహన్‌రావ్‌వాణ్ణి ఒకరకంగా చూస్తూ, ఇంకొకరకంగా నవ్వుతూ. "ఏరా కేడీనా కొడకా?'... ఇక్కడ చేరావ్?" అని దబాయించినట్లే ధైర్యం చెప్పాడు.

"హవున్సాబ్! హవున్సాబ్! ఈడు కేడీ నీ కొడుకుసాబ్! నాదీ నగల్‌పెట్టె...!" అని సేట్ చందూలాల్ అంటూంటే "ఏరా! సేట్‌సాబ్ సూట్‌కేస్‌కే ఎసరు పెట్టాలనుకొన్నావా?" అని మధ్యలోనే అందుకొన్నాడు మోహన్‌రావ్.

"సార్! ఎక్కడెక్కడో దొంగలించుకొచ్చినాన్ సార్! అన్నీ సేట్ చేతికే ఇచ్చినానుసార్! నిజంచెప్పాలకద సార్!_ అడిగినప్పుడంతా పాతికాపరకా ఇచ్చినాడే అనుకోండి. అయినా నాభాగం నాకీయల్నా? మీరే నాయం చెప్పండిసార్! అడిగితే నన్ను దొంగ అంటున్నాడుసార్!"

రిక్షావాడు అతివినయంగా అంతకంటే సహజంగా పాచిక విసిరాడు.

"ఆc! అయితే ఇవన్నీ దొంగనగలన్న మాట. నడవండి స్టేషన్‌కి"

మోహన్‌రావ్ గద్దించేసరికి తుపాకీశబ్దానికి చెట్టుమీద నుండి ఎగిరే కాకుల్లా మార్వీడీలు దిక్కుకొక్కరయ్యారు. సేట్‌జీ బిత్తర చూపులు చూస్తున్నాడు. రిక్షావాడు మాత్రం ముసిముసిగా నవ్వుకొంటున్నాడు.

"ఒకరి మొగం ఒకరు చూస్తూ నిలబడ్తే ఏమవుతుంది? ముందు నడవండి స్టేషన్‌కి. సేట్‌జీ ఎక్కురిక్షా!" గదమాయించాడు మోహన్‌రావ్.

సేట్ చందలాల్ రిక్షాలో కూర్చున్నాడు. మోహన్‌రావు మోటార్ సైకిలెక్కాడు. అందరుకలసి పోలీస్‌స్టేషన్ వైపు బయల్దేరారు.

* * * * *

ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య ప్రజాసేవ కర్తవ్యంగా తలమునకలవుతున్నాడు. ఒక పక్క కంట్రాక్టర్లు... ఒకపక్క బదిలీలకోసంకాకాపడ్తూ ఉద్యోగులు...మరోపక్క పెన్షన్‌కోసరమని అర్జీలతో వయస్సులోనే రాతచెడిన రమణీమణులు_ ఎవరికి తగినట్లుగా వాళ్ళకు సమాధానాలు చెప్తూ ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య అష్టావధానిలా తికమక పడుతున్న తరుణంలో కొసురుగా ఫోన్ మోగింది. ఎరుకలయ్య దురుసుగా ఫోన్‌చేతికందుకొన్నాడు.

"హలో!...నమస్తే సార్!... నేను మోహన్రావ్‌ని సార్!" అవతలి కంఠం.

"ఏమోహన్రావో శ్యామల్‌రావో? అబ్బబ్బ... చద్దామంటే చావడానిక్కూడా టైం లేదు గదయ్యా?... ఓహోహోహో! ఎస్.ఐ. మోహన్రావా? ఏంవిటి విశేషాలు?"

"మీరు స్టేషన్‌కి రావాలి సార్!"

"ఏంవంటున్నావ్? ఒళ్ళు దగ్గర పెట్టుకొనే మాట్లాడుతున్నావా?"

"సార్ సార్ సార్! అంతకోపమైతే ఎలాసార్!... మీ నగలు...'

"ఆc! మా నగలు?..."

"దొరికాయ్‌సార్!"

"నాకు తెలియకడుగుతాను. మీరెట్లా ఉద్యోగం చేస్తుండారయ్యా!"

"అదేంవిటి సార్? మీ నగల్ని..."

"అదేనయ్యా నేనూ అనేది. చదువుకున్నోళ్ళు గదా? చెప్పే వార్త ఎట్లా చెప్పాలంటావ్? సీతను చూసొచ్చిన ఆంజనేయుడు రాముడితో ఎట్లా చెప్పినాడు? – 'కంటిన్‌జానకిన్' అన్నాడు. అట్లా గదయ్యా చెప్పాలి. అట్లాగాననుంటే ఈ సోదెంతా ఎందుకు? ఎప్పుడో రెక్కలు గట్టకొనొచ్చి వాలుండనా?" అని పకపకనవ్వుతూ ఫోన్ పెట్టేసి ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య ఎకాఎకిని కారెక్కి ఎవరితో ఏమాట అనకుండా బయలుదేరాడు.

అయ్యగారింటి ముందర పడిగాపులు గాస్తున్న వాళ్ళకేమీ అర్థంకాకుండా ఒకరిమొగం ఒకరు చూసుకొంటున్నారు.

రెక్కలుగట్టుకుని వచ్చి వాలాతానన్న ఎం.ఎల్.ఎ. అన్నంతపనిచేసినట్లుగా కార్లో వచ్చి దిగేసరికి మోహన్‌రావ్ ఎదురుసేవతో సవినయంగా తోడ్కొనివచ్చి ఏకంగా తన సీట్లోనో కూర్చోబెట్టి సకలోపచారములు తన సిబ్బంది మూలంగా ఘనంగా జరిపించాడు.

ఆ తరువాత సూట్‌కేస్ టేబిల్‌మీద పెట్టి దర్జాగా తెరిచాడు.

ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య కండ్లు జిగేల్ మన్నాయి.

అయినా బెట్టుసరిగా "మేఁవిచ్చిన కంప్లీట్ పకారం అన్నీ సరిగ్గానే ఉండాయిగదా? అయినా ఉండకేడబోతాయిలే!" అని సందేహానికి సంతృప్తి జోడించి పలుకుతూ ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య బయల్దేరుతూంటే మోహన్‌రావ్ సూట్‌కేస్ హెడ్ చేతికిచ్చాడు. సగౌరవంగా సాగనంపడం తనబాధ్యతగా భావించిన మోహన్‌రావ్ వినయంగా ముందు నడుస్తూంటే ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య దర్జాగా పోలీసుల సెల్యూట్‌లు స్వీకరిస్తూ కారుదగ్గరికి నడుస్తున్నాడు సూట్‌కేస్ చేతపట్టుకొని 'హెడ్' వెంటరాగా!

మోహన్‌రావ్ గబాగబావెళ్ళి కారుడోర్ తెరిచి పట్టుకొన్నాడు. అయితే ఈ విషయం నలుగురి కండ్లల్లో కాదు– కనీసం తన డ్రైవర్ కంట్లోకూడా పడకూడదనుకొన్న ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య స్వయంగా కారునడుపుకొని రావడంతో తానే కారు తలుపుతెరుచుకొని స్టీరింగ్ ముందుకూర్చున్నాడు. 'హెడ్' సూట్‌కేస్ చేతపట్టుకొని దర్జాగా వెనుకసీట్లో కూర్చున్నాడు. ఎస్.ఐ. తలుపు తెరిచిపట్టుకొని ఉంటే!–

మోహన్‌రావు హెడ్‌వైపు కొరకొరా చూస్తూ తలుపు దభీమని వేశాడు. ఆశబ్దానికి అదిరిపడినట్లుగా ఎం.ఎల్.ఎ. వెనక్కు తిరిగిచూసేసరికి మోహన్‌రావు చిరునవ్వులు చిందబోస్తూ "సార్! నా ప్రమోషన్ సంగతి! సార్!" అన్నాడు.

"ప్రమోషన్ సంగతటుంచు మోహన్రావ్. ముందుగా నీకు రాష్ట్రపతి అవార్డు ఇప్పించాలి. అంతవరకూ ఈ కంటిమీద రెప్పపడదనుకో!" అంటూ రెప్పపాటులో అదృశ్యమయ్యాడు ఎరుకలయ్య!

ఏడేండ్లకు మునుపు ఎరుకలయ్య వెనక బడినవాడు!

ఇప్పుడెవరైనా ఎరుకలయ్య వెనుకబడినవాడంటే– వాడే వెర్రివాడు!

పార్టీ టికెట్ సాధించడానికి ప్రజల ఓట్లు కొట్టేయడానికి ఏడేండ్లకుమునుపు ఎరుకలయ్య వెనకబడినవాడు. ఇప్పుడు ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య తహశీల్దార్‌ని దబాయించడంలో వెనక బడలేదు. ఆర్డీవోను హడలగొట్టడంలో వెనకబడలేదు. పోరంబోకుల్ని పంచినట్లే పేదలకు పంచిపెట్టి, ఆస్తి పెంచుకోవడంలో వెనకబడలేదు. పార్టీఫండ్‌తో అందాల మేడను కట్టుకోవడంలో అసలే వెనకబడలేదు!

ఆ అందాలభవంతిలో అంతకంటే అందమైన గదిలో అద్దంముందు నిలబడింది ఎం.ఎల్.ఎ. ఎరుకలయ్య సతీమణి!

"ఇంతకాలం మిమ్మల్నేమో అనుకొన్నానండీ! మీకొచ్చినంత రాజకీయం ముక్కె మంత్రిగ్గూడా రాదు. ఏనాటికో ఒక నాటికి నా నోటివాక్కు పలించకపోదు. మీరు ముక్కెమంత్రి కాకుండా పోరు. గిల్టునగలు పోతేపోయినాయ్. పోలీసురిపోర్టెందుకంటే ఇనకుండా ఇచ్చి మొత్తానికి సాధించినారుగదండీ!... ఏం ముక్కెమంత్రో? ఇంత మంచి బుర్రకొక మంత్రిపదవిగూడా ఈలేకుండా పొయ్‌నాడు!" అని వాపోయినట్లే మురిసిపోతూ సూట్‌కేస్‌లోని ఒక్కొక్క నగతీసి ఒంటిమీద పెట్టుకొంటూ అద్దంలో చూసుకొంటూ తన అందానికి తానే మురిసిపోతూ ఉంది– ఒకనాడు గిల్టునగలు అమ్ముకొని పొట్టపోసుకున్న సంగతి మర్చిపోయి.

ఆమాటలతో ఎం.ఎల్.ఎ. గుండె ఇంతై అంతై ముఖ్యమంత్రి గుండెఅంత అయితే ఎడమచేయి దర్జాగా కుడిమీసాన్ని మెలేస్తూ ఉంది.

"అబ్బ! ఎంతకాలానికి బతకనేర్చుకున్నారండీ! ఆ ఎస్.ఐ.గారు ప్రమోషన్ కొట్టేస్తే హెడ్‌గా ఉండి ఈ మాత్రం మీరు కొట్టేయకపోతే హెడ్ ఉన్నట్లా? లేనట్లా?" అని అంటూ రవ్వల నెక్లెస్‌ను చూస్తూ మురిసిపోతూ ఉంది– హెడ్‌గారి పెద్దింట్లో చిన్నావిడ!

హెడ్ ఠీవిగా తలపంకిస్తున్నాడు.

ఇలాంటి మనస్తత్వాలు కబంధహస్తాలై గొంతులు నులుముతుంటే ఈ దేశంలో ఊపిరాడక విలవిల కొట్టుకొంటున్న సుమతీ సూర్యారావులు ఎందరో?... ●

స్వాతిమాసపత్రిక
(1, ఆగస్టు 1985)